
సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 4 । మే । 2025



పోటెత్తిన శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం శనివారం భక్తులతో పోటెత్తింది. వేలాది మంది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి ఆలయానికి తరలివచ్చారు. IIలో ▸



సంక్షోభంలో మామిడి పరిశ్రమ

మామిడి పరిశ్రమ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అకాల వర్షాలు, వడగళ్లు, మంగు తెగులు కారణాలతో మామిడి దిగుబడి తగ్గింది. IIలో ▸



కుళ్లిపోతున్నా పట్టించుకోరా?

ఏలూరు సర్వజన ఆస్పత్రి ప్రాంగణంలోని శవ పరీక్ష కేంద్రం (మార్చురీ)లో ఫ్రీజర్ బాక్సులు పనిచేయక మృతదేహాలు పాడవుతున్నాయి. IIలో ▸

న్యూస్‌రీల్

అమరావతి సభకు వెళ్లొస్తుండగా ప్రమాదం



దెబ్బతిన్న రాజోలు డిపో బస్సు

నరసాపురం రూరల్: మండలంలోని సీతారామపురంలో 216 జాతీయ రహదారిపై శనివారం వేకువజామున రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం అమరావతిలో ప్రధాని సభకు వెళ్లి వస్తున్న రాజోలు డిపో బస్సు బ్రేక్ డౌన్ కావడంతో సంఘటనా స్థలంలో నిలిపివేశారు. అదే సభకు వెళ్లి తిరిగి వస్తున్న రాజోలు డిపో మరో బస్సు ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సు డ్రైవర్, సిబ్బందికి గాయాలు కాగా 108లో నరసాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీల్లో నియామకాలు

భీమవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో నియమిస్తూ కేంద్ర కమిటీ కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర వాణిజ్య విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా పాలకొల్లు నియోజకవర్గానికి చెందిన ఉనికిలి శ్రీను, రాష్ట్ర ఎంప్లాయీస్, పెన్షనర్స్ వింగ్ సెక్రటరీగా తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి చెందిన చామన సూర్యచంద్రరావు నియమితులయ్యారు.

వేసవి సెలవులను నిరోధించేలా ప్రొసీడింగ్స్

భీమవరం: రెమిడియల్ తరగతుల పేరుతో ప్రభుత్వం ఇచ్చిన ప్రొసీడింగ్స్ ఉపాధ్యాయుల వేసవి సెలవులను నిరోధించడమేనని ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి శనివారం ప్రకటనలో తెలిపారు. టెన్త్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ఫెయిలైన 18.86 శాతం మంది పిల్లల కోసం సప్లిమెంటరీ పరీక్షలకు ఇప్పటికే చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఫెయిలైన పిల్లల కోసం ఉపాధ్యాయులను మండు వేసవిలో వేధించకుండా ప్రభుత్వం ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను ఉపసంహరించుకుని, టీచర్లు వేసవి సెలవులు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని గోపిమూర్తి కోరారు.

దళిత క్రైస్తవుల ర్యాలీ

భీమవరం: ఎస్సీలు చర్చిలకు వెళితే ఎస్సీ హోదాను కోల్పోతారని హైకోర్టు తీర్పు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ దళిత క్రైస్తవుల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్ వద్ద శనివారం రాత్రి క్యాండిల్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ కన్వీనర్ కోనా జోసెఫ్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం దేశంలో పుట్టిన ఏ వ్యక్తి అయినా ఏ మతాన్ని అయినా స్వీకరించవచ్చని, హైకోర్టు తీర్పును పునః పరిశీలించాలని కోరారు. గంటా సుందర్‌కుమార్, ఈది రవికుమార్, గాతల సందీప్, కమలాకర్, ఈది రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

12న అప్రెంటీస్ మేళా

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 12న ప్రధానమంత్రి అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్టు ఐటీఐ జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరాజు శనివారం తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2021 నుంచి 2024 మధ్య వివిధ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గలవారు ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్సులతో హాజరుకావాలని సూచించారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు



ఏలూరులో అడిషనల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 20 నుంచి సమ్మెలోకి వెళుతున్నట్టు ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పరాజు తెలిపారు. శనివారం సమ్మె నోటీసును ఏలూరు అడిషనల్ కమిషనర్ చంద్రయ్యకు అందజేశారు. ఏలూరు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, ఎన్ఎంఆర్ కార్మికుల సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని, సరెండర్ లీవ్ బకాయిలు, డీఏలు, 11వ పీఆర్సీ బకాయిలు తక్షణమే చెల్లించాలని సిబ్బందికి కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలని కోరారు.

సీజనిల్ సేల్స్

ఎన్నో ఏళ్లుగా హోమ్‌నీడ్స్ వ్యాపారం చేస్తున్నాను. ఏటా సమ్మర్ సీజన్‌లో 150 వరకు ఏసీ యూనిట్లు అమ్మేవాళ్లం. ఈ ఏడాది సరిగా అమ్మకాలు జరగడం లేదు. అప్పుడే రెండు నెలలు గడిచి పోయినా ఇంకా 25 యూనిట్లు కూడా అమ్మలేదు. ఫ్రిజ్‌లు, కూలర్ల సేల్స్ కూడా పడిపోయాయి. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు.

– ఇదీ భీమవరానికి చెందిన ఓ వ్యాపారి ఆవేదన



తణుకులోని ఓ షాపు వద్ద ఏసీలు, గృహోపకరణ సామగ్రి

సమ్మర్ మార్కెట్ డల్

- పడిపోయిన ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌ల అమ్మకాలు
- గతంలో వేసవి ప్రారంభానికి ముందు నుంచే సమ్మర్ సేల్స్ జోరు
- ఏటా సమ్మర్ సీజన్‌లో జిల్లాలో రూ.100 కోట్లకు పైగా అమ్మకాలు
- గత రెండు నెలల్లో 50 శాతం కూడా అమ్మకాలు లేవంటున్న వ్యాపారులు
- ఎండలు మండుతున్నా.. సంక్షేమం జాడలేక జనం జేబులు ఖాళీ
- బెంబేలెత్తిస్తున్న విద్యుత్ బిల్లులు

సాక్షి, భీమవరం: వేసవి వస్తుందంటే వినియోగదారులతో కిటకిటలాడుతూ కనిపించే ఏసీ, ఫ్రిజ్, కూలర్లు తదితర హోమ్‌నీడ్స్ షాపులు ఈ సమ్మర్ సీజన్‌లో వెలవెలబోతున్నాయి. సమ్మర్ సేల్‌లో రెండు నెలలు గడిచిపోగా 50 శాతం కూడా అమ్మకాలు జరగలేదని వ్యాపార వర్గాలంటున్నాయి. జనం దగ్గర డబ్బులు లేకపోవడం, విద్యుత్ చార్జీలు పెరిగిపోవడం సేల్స్ పడిపోవడానికి కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లాలో 60 వరకు షాపులు : జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో స్థానిక వ్యాపారులకు చెందిన ఎలక్ట్రికల్ హోమ్‌నీడ్స్ దుకాణాలు 60 వరకు ఉన్నాయి. సోనోవిజన్, బజాజ్ ఎలక్ట్రానిక్స్, రిలయన్స్ తదితర ప్రముఖ కంపెనీలకు చెందిన బ్రాంచీలు, కార్పొరేట్ షోరూమ్‌లు 25 వరకు ఉంటాయి. ఆయా సంస్థలు, ఈ–కామర్స్‌లో సమ్మర్ సేల్స్ రూ.100 కోట్లకు పైగా ఉంటుందని అంచనా.

మార్చి నుంచే మొదలు

ఎండల తీవ్రత పెరగడం వలన ఏసీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు, ఇన్వెర్టర్ల సమ్మర్ సేల్స్ మార్చి నుంచే మొదలవుతాయి. ముస్ముందు మరింత పెరిగే ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కోసం ఆయా గృహోపకరణాల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తారు. కొత్తగా కొనేవారు కొందరైతే, ఎక్స్ఛేంజ్ ఆఫర్‌లో పాత వాటిని ఇచ్చేసి కొత్త వస్తువులను తీసుకునే వారు మరి కొందరు. ఆన్‌లైన్‌తో పాటు షాపుల్లోనూ ఈఎంఐల పద్ధతిలో ఫైనాన్స్ సదుపాయం ఉండటంతో పేద, మధ్య తరగతి వర్గాల వారు నెలనెలా వాయిదాలు కట్టుకోవచ్చన్న భావనలో ఏసీలు, ఫ్రిజ్‌ల కొనుగోలుకు ప్రాధాన్యమిస్తున్నారు. సమ్మర్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా నెలకు 8,000 నుంచి 10,000 ఏసీలు, 3,000 వరకు ఫ్రిజ్‌లు, 5,000 వరకు కూలర్లు, 4,000 వరకు ఇన్వెర్టర్లు అమ్ముడవుతుంటాయని వ్యాపార వర్గాలు అంటున్నాయి. ఎన్నికల ప్రభావం వలన గతేడాది అనుకున్నదాని కంటే దాదాపు రెట్టింపు అమ్మకాలు జరిగినట్టు తణుకుకు చెందిన ఓ వ్యాపారి తెలిపారు. సమ్మర్ సీజన్ కోసం మార్చికి ముందే వ్యాపారులు స్టాకులు పెట్టుకున్నారు.

చుక్కలు చూపిస్తున్న విద్యుత్ చార్జీలు

కూటమి పాలనలో విద్యుత్ చార్జీలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. సాధారణ వినియోగమే అయినా గతంతో పోలిస్తే రెట్టింపు బిల్లులు వస్తున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. అప్పు చేసి ఏసీ కొందామన్న విద్యుత్ చార్జీలు మరింత పెరిగిపోతాయని, వీటిని సాకుగా చూపించి ప్రభుత్వం భవిష్యత్‌లో తమకు సంక్షేమ పథకాలు రాకుండా చేస్తుందన్న భయంతో పేద, మధ్యతరగతి వర్గాలు వెనుకడుగేస్తున్నాయి. దీంతో వినియోగదారులు లేక షాపులు వెలవెలబోతున్నాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లో సగం అమ్మకాలు కూడా జరగలేదని వ్యాపారులు అంటున్నారు. కస్టమర్లను ఆకర్షించేందుకు ఆఫర్లు ప్రకటిస్తున్నా అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయని, గతంలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి చూడలేదని చెబుతున్నారు.

షాపులు వెలవెల

కొద్దినెలలుగా మార్కెట్ డల్ అయిపోవడం సమ్మర్ సేల్స్ పైనా పడింది. గత ప్రభుత్వంలో ప్రతి నెలా పథకాలు పేదవర్గాల తలుపు తట్టేవి. కూటమి పాలనలో సంక్షేమం జాడ లేకుండా పోయింది. పనులు కూడా సరిగా లేకపోవడం, నిత్యావసరాల ధరలకు రెక్కలు రావడం పేద, మధ్యతరగతి వర్గాల జీవన ప్రమాణాలను దుర్భరంగా మార్చేశాయి.

సంచుల కోసం రైతుల ధర్నా



జుత్తిగలో ధర్నా చేస్తున్న రైతులు

పెనుమంట్ర: ధాన్యం మాసూళ్లు చేసి రోజులు గడుస్తున్నా రైతు సేవా కేంద్రాల్లో గోనె సంచులు సరఫరా చేయడం లేదని, మిల్లుల వద్ద తూకాల్లో మోసాలను అరికట్టాలంటూ శనివారం జుత్తిగ రైతు సేవా కేంద్రం వద్ద రైతులు ధర్నాకు దిగారు. వీరికి జిల్లా కౌలు రైతు సంఘం మద్దతు తెలిపింది. తహసీల్దార్, వ్యవసాయ అధికారి ఇక్కడకు వచ్చి ఆదివారం నాటికి జుత్తిగ గ్రామానికి 25 వేల సంచులు అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. అనంతరం జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు, సంచుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పీఆర్ 126 రకం ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయడం లేదని, బయట అమ్ముకోవాలని చెబుతున్నారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ సంచికి అదనంగా ధాన్యం తూకం వేయడం, తేమ శాతం, నూక శాతం పేరుతో రైతులను మిల్లర్లు దోచుకుంటున్నారని విమర్శించారు. ధాన్యం తూకంలో తాము మోసపోయిన విషయాన్ని అధికారుల దృష్టికి రైతులు తీసుకువచ్చారు. సంచికి అదనంగా 600 గ్రాముల తరుగు మిల్లర్లు మినహాయిస్తున్నారన్నారు.

సీహెచ్‌ఓల సమ్మెకు మద్దతు



భీమవరంలో సీహెచ్‌ఓలకు మద్దతుగా సమ్మెలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భీమవరం: తమ సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సీహెచ్‌ఓ) అసోసియేషన్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆందోళనకు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. భీమవరం కలెక్టరేట్ వద్ద ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న సీహెచ్‌ఓల శిబిరం వద్దకు శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ వెళ్లి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సీహెచ్‌ఓలకు న్యాయం జరిగే వరకూ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సమస్యలను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వంతో పోరాడి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఉండి, పాలకొల్లు సమన్వయకర్తలు పీవీఎల్ నర్సింహరాజు, గుడాల గోపి, ఎంపీపీ పేరిచర్ల విజయ నర్సింహరాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కూటమి ప్రభుత్వం దగా

- ధాన్యం కొనుగోలులో దళారుల ప్రమేయం
- రైతుల ఇబ్బందులు జేసీకి వివరించిన వైఎస్సార్‌సీపీ నేతలు



జేసీకి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

భీమవరం: ధాన్యం కొనుగోలులో దళారుల ప్రమేయంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. దాళ్వా ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలని, దళారుల ప్రమేయం అరికట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పంట దిగుబడులు బాగున్నా దళారులు, మిల్లర్ల ప్రమేయంతో రైతులు బస్తాకు రూ.400 వరకు నష్టపోతున్నారన్నారు. సంచుల కొరత, అకాల వర్షాలతో ఇబ్బంది పడుతున్నారన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పారదర్శకంగా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల వద్దకు అధికారులు వెళ్లి ధాన్యం కొనుగోలు చేసేవారని ప్రసాదరాజు, కారుమూరి అన్నారు. అయితే ప్రస్తుతం దళారులు, మిల్లర్ల ప్రమేయంతో పట్టుబడులు ముందుకు సాగడం లేదన్నారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంనాయుడు ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వం కొనుగోలు చేయలేదని ప్రకటించడంతో రైతుల్లో ఆందోళనలు రేకెత్తించి దళారులు అయినకాడికి దోచుకుంటున్నారని విమర్శించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు రైతుల గోడు పట్టడం లేదని దుయ్యబట్టారు. సంచుల కొరత, తేమశాతం పేరుతో రైతులు దోపిడీకి గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, దీంతో రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారన్నారు. తక్షణమే చర్యలు తీసుకోకుంటే రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరుబాట పడుతుందని హెచ్చరించారు.

మొత్తం ధాన్యం ప్రభుత్వమే కొనాలి

జిల్లాలో సుమారు 10 లక్షల టన్నుల ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, తేమ శాతం, ముక్క పేరుతో రైతులను వేధించకుండా చర్యలు తీసుకోవాలని, ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఉండి, పాలకొల్లు సమన్వయకర్తలు పీవీఎల్ నర్సింహరాజు, గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి), పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, భీమవరం ఎంపీపీ పేరిచర్ల విజయ నర్సింహరాజు, నాయకులు బంధన పూర్ణచంద్రరావు, గాదిరాజు రామరాజు, చవాకుల సత్యనారాయణ, జల్లా కొండయ్య, చిగురుపాటి సందీప్, కోడే యుగంధర్, ఇంటి సత్యనారాయణ, గుంటి ప్రభు, పెనుమాల నర్సింహస్వామి, రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

తవ్వేయ్.. తరలించేయ్

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలంలో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రోజూ రాత్రి వేళల్లో ఏదోక గ్రామంలో పొక్లెయిన్ల ద్వారా మట్టిని తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. పేదల గృహ నిర్మాణాలకు మట్టి రవాణాకు అనుమతి ఇవ్వని అధికారులు.. అక్రమార్కులు కొండలు, గుట్టలు తవ్వి మట్టి తరలిస్తూ కోట్లు గడిస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బుట్టాయగూడెం మండలం కె.బొత్తప్పగూడెం సమీపంలో నూతనంగా నిర్మించనున్న ఓ పెట్రోల్ బంక్ స్థలం వద్దకు చింతలపూడి ఎత్తిపోతల పథకం గట్టును కొల్లగొట్టి మట్టిని తరలిస్తున్నారు. అధికారులు స్పందించి మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పేదల ఇళ్ల తొలగింపు అన్యాయం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి



గొల్లలకోడేరులో ఇళ్ల తొలగింపు ప్రాంతంలో బాధితులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి, మాజీ మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ కవురు, ఇన్‌చార్జులు పీవీఎల్, గోపి

పాలకోడేరు: ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్లను అన్యాయంగా తొలగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు మండిపడ్డారు. అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ అడ్డు కాదని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులు మానుకోవాలని అన్నారు. మండలంలోని గొల్లలకోడేరులో ఇటీవల తొలగించిన వ్యాపార సముదాయాల ప్రాంతాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుల బృందం శనివారం పరిశీలించింది. అనంతరం పార్టీ నేత చేకూరి రాజా నరేంద్రరాజు నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ముదునూరి మాట్లాడుతూ కనీసం నోటీసులు ఇవ్వకుండా ఇళ్లు తొలగించడంపై పేదలు ఆవేదన చెందుతున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లక్షలాది మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎంతమందికి ఇళ్లు ఇచ్చారని ప్రశ్నించారు. ఇళ్లు తొలగించిన బాధితులకు మూడు సెంట్ల చొప్పున స్థలం ఇచ్చి గృహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అధికార బలం ఉందని పేదలపై జులుం సరికాదన్నారు. పలు నియోజకవర్గాల్లో సమస్యలు చాలా ఉన్నాయని, పలుచోట్ల ప్రజలు తాగు, సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, డెల్టా ఆధునికీకరణకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం ఖర్చు చేయలేదని విమర్శించారు. ధాన్యానికి గిట్టుబాటు ధర లేదని, ఆక్వా ఫీడ్, సీడ్ ధరలు విపరీతంగా పెరగ్గా నియంత్రించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ధ్వజమెత్తారు. ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాడుతుందన్నారు.

సూపర్ సిక్స్‌పై ముఖం చాటేసిన సర్కారు

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పి ప్రభుత్వం ముఖం చాటేసిందని విమర్శించారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌పై బురద చల్లి తిరిగి అదే కొనసాగిస్తున్నారంటే కూటమి నాయకులు అబద్ధాలు చెప్పి ఎలా అధికారం చేపట్టారో అర్థమవుతుందన్నారు. డెల్టా ప్రాంతంలో కాలువలు, డ్రెయిన్లు, రోడ్ల వెంబడి ఆక్రమణలు ఉండటం సహజమని, అయితే ఉండి నియోజకవర్గంలో ఇళ్ల ధ్వంసం సరికాదన్నారు. పేదలకు మూడు సెంట్లు స్థలం ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆక్వా రైతులు క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితికి వచ్చారంటే ప్రభుత్వం సిగ్గుపడాలని అన్నారు.

ప్రత్యామ్నాయం చూపకుండా తొలగింపా?

ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు మాట్లాడుతూ పేదలకు ఎటువంటి సమయం ఇవ్వకుండా, ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు తొలగిస్తున్నారని విమర్శించారు. ఉండి నియోజకవర్గంలో అవసరం లేకపోయినా పేదల ఇళ్లను తొలగిస్తున్నారని అన్నారు. బాధితులకు కూటమి మేనిఫెస్టో ప్రకారం మూడు సెంట్లు స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. పేదలకు అన్యాయం జరిగితే వారి పక్షాన పోరాడటానికి వైఎస్సార్‌సీపీ ముందుంటుందన్నారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి, పేరిచర్ల విజయ్ బాబు యూత్ జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి సందీప్, బంధన పూర్ణచంద్రరావు, నాయకులు చేకూరి రాజా నరేంద్ర రాజు, ఆవుదు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి, మాజీ మంత్రి కారుమూరి



నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు మురళీ కృష్ణంరాజును సత్కరిస్తున్న నాయకులు

కాళ్ల: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలు గడుస్తున్నా అభివృద్ధి జాడలేదని, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలోనూ విఫలమైందని, ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పెద అమిరంలో శనివారం పార్టీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో పార్టీ నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ అబద్ధాలు చెప్పి, ప్రజలను మోసగించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో మట్టి, గ్రావెల్ మాఫియాలతో రౌడీ పరిపాలన చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని, అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. పార్టీలో కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని, పార్టీకి 2019 నాటి పునర్వైభవం తప్పక వస్తుందని స్పష్టం చేశారు.

సంస్థాగతంగా పునర్నిర్మాణం

పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ సంస్థాగతంగా పార్టీని పునర్నిర్మాణం చేస్తూ ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామని అన్నారు. ఇప్పటికే జిల్లాస్థాయిలో కమిటీల నియామకం పూర్తి చేశామని, రానున్న రోజుల్లో గ్రామ, బూత్ స్థాయిలో కమిటీలు వేస్తామని చెప్పారు. రైతులు పండించిన ప్రతి గింజా ప్రభుత్వం కొనుగోలు చేసే వరకు ఊరుకునేది లేదని హెచ్చరించారు.

సంపద సృష్టి బాబు కుటుంబానికే..

రాష్ట్రంలో సంపద సృష్టి చంద్రబాబు కుటుంబానికే అని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. ప్రతి రైతుకూ న్యాయం చేస్తామని ప్రగల్భాలు పలికిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఇక్కడి రైతుల కష్టాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గోనె సంచులు కూడా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు.

అప్పుడు నీరు–మట్టి.. ఇప్పుడు చాక్లెట్

అమరావతి పునర్నిర్మాణ సభలో ప్రధాని మోదీ ఏదో ఇస్తారని ప్రజలంతా ఎదురు చూశారని, గతంలో నీరు–మట్టి, ఇప్పుడు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కోసం చాక్లెట్ తెచ్చారని ఎద్దేవా చేశారు. అమరావతి శంకుస్థాపన పేరుతో కూటమి ప్రభుత్వం అప్పులు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం జిల్లా పరిశీలకుడు మురళీ కృష్ణంరాజును నేతలు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఉండి, పాలకొల్లు నియోజకవర్గాల ఇన్‌చార్జులు పీవీఎల్ నరసింహరాజు, గుడాల గోపి, నేతలు పేరిచర్ల విజయ నరసింహరాజు, బంధన పూర్ణచంద్రరావు, గాదిరాజు రామరాజు, చిగురుపాటి సందీప్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంజన్నకు అభిషేక సేవ



మద్ది క్షేత్రంలో ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహానికి అభిషేక సేవ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో ఆంజనేయస్వామికి శనివారం అభిషేక సేవ నిర్వహించారు. ఆలయ ముఖమండపంపై స్వామి ఉత్సవ మూర్తికి అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం వరకు వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.1,41,401 సమకూరినట్లు ఈవో ఆర్వీ చందన తెలిపారు. స్వామి నిత్యాన్నదాన సత్రంలో అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

భక్తులతో పోటెత్తిన శ్రీవారి క్షేత్రం



ఉచిత ప్రసాద వితరణ క్యూలైన్లలో కిక్కిరిసిన భక్తులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రం శనివారం భక్తులతో పోటెత్తింది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు, అందులోనూ వేసవి సెలవులను పురస్కరించుకుని వేలాది మంది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి ఆలయానికి తరలి వచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలవడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. తూర్పురాజగోపుర ప్రాంతం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కల్యాణ కట్ట తదితర విభాగాలు భక్తులతో కిక్కిరిసాయి. ఆలయ అనివేటి మండపంలో ఒడుగు వేడుకలు అధిక సంఖ్యలో జరిగాయి. రాత్రి వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు తెలపండి

ఏలూరు (ఆర్ఆర్పేట): ప్రభుత్వ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాను పాఠశాల విద్యా శాఖ ఆర్జేడీ వెబ్సైట్లో అందుబాటులో ఉంచామని, దీనిపై ఎవరికైనా అభ్యంతరాలున్నా తెలపాలని పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి.నాగమణి ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టీఐఎస్) ఆధారంగా రూపొందించి గత ఏప్రిల్ 22వ తేదీ వరకూ అభ్యంతరాలకు గడువు ఇచ్చామని, అనంతరం తమకు అందిన అభ్యంతరాల ప్రకారం జాబితాను తయారు చేసి ఆర్జేడీ కాకినాడ వెబ్సైట్లో, ఉమ్మడి తూర్పు గోదావరి, ఉమ్మడి పశ్చిమ గోదావరి, ఉమ్మడి కృష్ణ జిల్లా విద్యాశాఖల వెబ్సైట్లో, నోటీస్ బోర్డుల్లో అందుబాటులో ఉంచామన్నారు.

సంక్షోభంలో మామిడి పరిశ్రమ

- భారీగా తగ్గిన దిగుబడి
- గిట్టుబాటు ధర లేక దిగాలు
- మెట్ట ప్రాంతంలో ఏటా రూ.10 కోట్ల వ్యాపారం



చింతలపూడి మార్కెట్లో ఎగుమతికి సిద్ధంగా ఉన్న బంగినపల్లి మామిడి

చింతలపూడి: మామిడి పరిశ్రమ ఈ సంవత్సరం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అకాల వర్షాలు, వడగళ్లు, మంగుతెగులు వంటి అనేక కారణాలతో మామిడి దిగుబడి తగ్గింది. మామిడి ఎగుమతుల్లో ఏలూరు జిల్లాలో నూజివీడు తరువాత స్థానం చింతలపూడిదే.. ఈ ప్రాంతంలో ప్రస్తుతం వ్యాపారం మందగించింది. సీజన్ ప్రారంభమై నెలన్నర కావస్తున్నా ఇంతవరకూ ఆశించిన స్థాయిలో ఎగుమతులు లేవు. కాయ దిగుబడి లేకపోవడం, కోతకు వచ్చిన కొద్దిపాటి కాయ నాణ్యత లోపించడంతో ఎగుమతులు మందగించాయని వ్యాపారులు చెబుతున్నారు. కాయ మంచి సైజుకు ఎదిగే వరకూ చెట్టుమీదే ఆపడానికి రైతులకు ధైర్యం చాలడంలేదు. అకస్మాత్తుగా గాలి దుమ్మో, వడగళ్ల వానో వస్తే మరింత నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇదే సమయానికి రోజుకు 25 లారీల సరుకు ఎగుమతి చేసేవారు. ఈ ఏడాది ఐదు లారీలు కూడ ఎగుమతి చేయలేక పోతున్నామని వ్యాపారులు వాపోతున్నారు. ఇంతవరకు చింతలపూడి ప్రాంతం నుంచి 300 లారీల సరుకు మాత్రమే ఎగుమతి చేసినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

ఈ ఏడాది ప్రారంభంలో టన్ను రూ.70 వేలు ఉన్న మామిడి ధర ఇటీవల హఠాత్తుగా పడిపోయింది. ప్రస్తుతం టన్ను ధర రూ.20 వేల నుంచి రూ.25 వేలుగా ఉంది. ప్రస్తుత ధర రైతుకు ఏమాత్రం గిట్టుబాటు కాదు. నాలుగేళ్లగా మార్కెట్లో మామిడి ధరలు చూస్తే 2022లో ప్రారంభంలో టన్ను రూ.లక్షకు అమ్ముడైంది. సీజన్ చివరికి వచ్చేసరికి టన్ను రూ.25 వేలకు పడిపోయింది. 2023లో ప్రారంభంలో టన్ను రూ.80 వేలు అమ్మగా సీజన్ చివరిలో రూ.20 వేలకు చేరింది. 2024లో టన్ను రూ.90 వేలు అమ్మగా సీజన్ చివరిలో టన్ను రూ.30 వేలకు పడిపోయింది. ఇక్కడి నుంచి ముంబయ్, కోల్కతా, నాగపూర్, గుజరాత్, హైదరాబాద్, పూనే, అహ్మదాబాద్, ఢిల్లీ, కాన్పూర్, ఒడిశా వంటి ప్రాంతాలకు వ్యాపారులు మామిడి ఎగుమతి చేస్తున్నారు.



లారీల్లో మామిడి కాయలు ఎగుమతి చేస్తున్న కార్మికులు

రైతుల నుంచి కొనుగోలు చేసిన మామిడిని రవాణా చేయడం వ్యాపారులకు భారంగా మారింది. ఈ ప్రాంతం నుంచి నాగపూర్ ఎక్కువగా ఎగుమతవుతుంది. విడికాయలు గ్రేడింగ్, ప్యాకింగ్ చేస్తే టన్నుకు రూ.5 వేల వరకూ ఖర్చవుతుందని వ్యాపారులు వాపోతున్నారు. దీంతో పాటు కిరాయి రూ 50,000 అవుతుందంటున్నారు. ఈ దశలో అటు రైతుల్లో, ఇటు వ్యాపారుల్లో ఇకపై మామిడి లాభసాటి కాదన్న అభిప్రాయం నెలకొంది.

జిల్లాలో తగ్గిన విస్తీర్ణం

జిల్లాలో అన్ని రకాల ఉద్యాన పంటలు కలిపి 1,08,300 హెక్టార్లలో ఉన్నాయి. ఒకప్పుడు జిల్లాలో లక్షలాది ఎకరాల్లో విస్తరించి ఉండే మామిడి తోటలు ప్రస్తుతం 40,000 ఎకరాలకు తగ్గిపోయాయి. అధిక భాగం మామిడి తోటలు తొలగించి రైతులు పామాయిల్ తోటలు వేసుకున్నారు. మామిడి స్థానంలో పామాయిల్ 44 వేల హెక్టార్లలో ఆక్రమించింది. జిల్లాలో నూజివీడు నియోజకవర్గంతో పాటు చింతలపూడి, ద్వారకా తిరుమల, నల్లజర్ల, టి.నరసాపురం ప్రాంతాల్లో మాత్రమే మామిడి తోటలు ఎక్కువగా ఉన్నాయి. మామిడి తోటల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుని రైతులకు ప్రోత్సాహం అందించక పోతే భవిష్యత్తులో మామిడి అంతరించిపోయే ప్రమాదం ఉంది.

మామిడి రైతులను ఆదుకోవాలి



ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలి. ఏటా సకాలంలో సరైన వర్షాలు కురవకపోవడం, ప్రకృతి వైపరీత్యాల కారణంగా దిగుబడులు లేవు. ఏటా మామిడి వల్ల నష్టాలను తట్టుకోలేక నాకున్న 4 ఎకరాల తోటను తొలగించాల్సి వచ్చింది.

– చేపూరి ఖాదర్బాబు, రైతు, చింతలపూడి మండలం

నష్టం తప్పేలా లేదు



ఈ ఏడాది నష్టం వచ్చేలా ఉంది. నాణ్యత లేని కారణంగా ఎగుమతులు మందగించాయి. ధర పెరిగితేనే కాని నష్టాల నుంచి బయటపడడం కష్టం. ప్రారంభంలో టన్ను రూ.70 వేల వరకూ ఉన్న ధర ప్రస్తుతం రూ.20 వేలు అమ్ముతుంది. ప్రస్తుతం ధర ఇలాగే కొనసాగితే రైతులు, వ్యాపారులు నష్టపోవాల్సిందే.

– చిక్కాల నాగేశ్వరరావు, మామిడి కమిషన్ వ్యాపారి, చింతలపూడి

రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులకు గాయాలు



ద్వారకాతిరుమల మండలం రాళ్లకుంట వద్ద రోడ్డుపై పడిపోయిన వృద్ధ దంపతులు జనార్థన్, సరోజిని

ద్వారకాతిరుమల: మండలంలోని రాళ్లకుంట సెయింట్ గ్జేవియార్ పాఠశాల వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. రాళ్లకుంటకు చెందిన పరసా జనార్థన్, సరోజిని దంపతులు ద్వారకాతిరుమలలోని సొసైటీ పెట్రోల్ బంకు సమీపంలో నిమ్మకాయలు, కొబ్బరి కాయలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. వ్యాపారం ముగించుకుని సాయంత్రం టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై స్వగ్రామానికి వెళ్తున్నారు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి జి.కొత్తపల్లి నుంచి ద్వారకాతిరుమల వైపుకు వెళుతున్న ఆటోను వీరి వాహనం ఎదురుగా ఢీకొట్టింది. దాంతో జనార్థన్, సరోజిని దంపతులు రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో స్థానికులు శ్రీవారి దేవస్థానం అంబులెన్స్లో పీహెచ్సీకి తరలించారు.

ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

తణుకు అర్బన్: వాహనం ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన తణుకు పట్టణంలో చోటు చేసుకుంది. 55 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తిని శుక్రవారం తణుకు ఆర్వోబీపై వాహనం ఢీకొట్టింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీలో ఉంచారు.

ట్రిపుల్ ఐటీలో ఉత్తరం కలకలం

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఆకాశరామన్న ఉత్తరంతో కలకలం రేగింది. కాంట్రాక్టు, గెస్ట్ ఫ్యాకల్టీ, మెంటార్లందరికి ఈ ఉత్తరం శనివారం పోస్టులో వచ్చింది. యూనివర్సిటీ యాజమాన్యం కాంట్రాక్టు, గెస్ట్ ఫ్యాకల్టీ పట్ల ఒక విధంగా వ్యవహరిస్తూ , పర్మినెంట్ ఉద్యోగులకు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా దోచిపెడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. తాము జీతాలు పెంచమని, గతంలో నెట్, సెట్ లేకుండా పీహెచ్డీకి ఇచ్చిన ఇంక్రిమెంట్లను ఇవ్వమని అడిగితే నిబంధనలంటూ అడ్డుపడుతున్న యాజమాన్యం, పర్మినెంట్ అధ్యాపకులకు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా ప్రమోషన్ తేదీలను మూడేళ్లు ముందుకు జరుపుకుంటున్నారని అందులో పేర్కొన్నారు. వార్షిక ఇంక్రిమెంట్ ఇవ్వమని అడిగితే జీవో నెంబరు 110ని బూచిగా చూపిస్తున్నారని, అదే శాశ్వత అధ్యాపకులకు మాత్రం జీవో నెంబరు 14, జీవో నెంబరు 20లో ఉన్న నిబంధనలకు విరుద్ధంగా పెయిడ్ జర్నల్స్, కాన్ఫరెన్స్ పేపర్లను చూపించి పదోన్నతుల తేదీలు జరిపించుకుంటున్నట్లు లేఖలో వివరించారు. ఇలా పలు ఆరోపణలు చేశారు. లోతైన విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆర్జీయూకేటీ కాంట్రాక్టు, గెస్ట్ ఫ్యాకల్టీ పేరుతో లేఖ విడుదల చేశారు. ఈ లేఖలో ఉన్నవన్నీ సత్యాలేనని, పీహెచ్డీ చేసిన మెంటార్లు, కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రూ.5 వేలు అదనపు ఇంక్రిమెంట్ కొన్నాళ్లు ఇచ్చి జీవో నెంబరు 110ను సాకుగా చూపించి ఆపేశారని, దీనివల్ల ఎంతో నష్టపోయామని వాపోతున్నారు.



కాంట్రాక్టు, గెస్ట్ ఫ్యాకల్టీ పేరుతో వచ్చిన లెటర్

క్రైస్తవుడిగా పరిగణించడం సరికాదు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దళితుడు చర్చికి వెళ్లినంత మాత్రాన క్రైస్తవుడిగా పరిగణించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం వర్తించదని చెప్పడం సరికాదని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. పట్టణంలో శనివారం జరిగిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ దళితులను బ్రాహ్మణులు గుడిలకు రానివ్వకపోవడం వల్లే దళితులు చర్చిలకు వెళ్తారన్నారు. అంటరానితనం కారణంగా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు, అట్రాసిటీ చట్టం అమలులోకి వచ్చాయని చెప్పారు.

శవాలు కుళ్లిపోతున్నా పట్టించుకోరా?

జీజీహెచ్లో పరిష్కారం కాని ఫ్రీజర్ల సమస్య

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ విభాగం ఆధ్వర్యంలో శవ పరీక్ష కేంద్రం(మార్చురీ) పనిచేస్తోంది. నిత్యం జిల్లా పరిధిలో రోడ్డు, రైలు ప్రమాదాల్లో మరణించినవారు, అనుమానాస్పద మృతులు, హత్యలు, ఆత్మహత్యలు, చికిత్స పొందుతూ మృతి చెందిన వారి మృతదేహాల్ని మార్చురీలో భద్రపరుస్తారు. మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ విభాగానికి చెందిన వైద్య నిపుణులు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగిస్తుంటారు. మార్చురీలోని ఫ్రీజర్ బాక్సులు పనిచేయక బంధువుల మృతదేహాలు పాడవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా సరిగా అంతిమ సంస్కారాలు చేయలేని పరిస్థితి నెలకొందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కేవలం ఐదు ఫ్రీజర్లే దిక్కు

ఏలూరు జిల్లా వ్యాప్తంగా రోజూ రెండు, మూడు లేదా ఒక్కోసారి నాలుగైదు మృతదేహాలు జీజీహెచ్లోని మార్చురీకి వస్తాయి. రోడ్డు ప్రమాదాల్లో మరణించినవారు, గుర్తు తెలియని మృతదేహాలు, రైల్వే డెత్స్ మృతదేహాలు మార్చురీలో రోజుల తరబడి భద్రపరచాల్సిన అవసరం ఉంటుంది. మార్చురీలో కేవలం రెండు పాత ఫ్రీజర్ బాక్సులు, మరో మూడు స్వచ్ఛంద సంస్థకు చెందిన ఫ్రీజర్ బాక్సులు ఏర్పాటు చేసిన అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.



ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలోని మెడికల్ కాలేజీ మార్చురీ (ఫైల్)

సిబ్బంది నిర్లక్ష్యం వల్లే..

ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసిన కొత్తలో 12 మృతదేహాలను భద్రపరిచేలా ఫ్రీజర్ బాక్సులు అందుబాటులో ఉంచారు. మొదటి నుంచి ఈ ఫ్రీజర్ బాక్సులు పనిచేయటంలేదు. మరో రెండు పాత ఫ్రీజర్ బాక్సులు పూర్తిగా పాడైపోవటంతో బయో మెడికల్ ఇంజనీర్ విభాగం వాటిని పక్కన పెట్టేసింది. ఫ్రీజర్ బాక్సులు సక్రమంగా పనిచేయటం లేదని ఉన్నతాధికారులకు మొదట్లోనే నివేదించారని మెడికల్ కాలేజీ అధికారులు చెబుతున్నారు.

ఆవేదనలో మృతుల బంధువులు

ఏలూరు జీజీహెచ్లోని మార్చురీలో ప్రస్తుతం మరమ్మతులు చేసిన రెండు పాత ఫ్రీజర్ బాక్సులు, మరో మూడు స్వచ్ఛంద సంస్థకు చెందిన ఫ్రీజర్ బాక్సులు అందుబాటులో ఉన్నాయని మెడికల్ కాలేజీ అధికారులు చెబుతున్నారు. ఏలూరు జిల్లా పరిధిలో రోజూ మూడు నుంచి నాలుగు మృతదేహాలు మార్చురీకి వస్తాయి. రైల్వే ప్రమాదాల్లో మృతదేహాలకు వారం రోజులకు పైగా పోస్టుమార్టం నిర్వహించే పరిస్థితి ఉండదు. సరాసరి రోజుకు మూడు నుంచి నాలుగు మృతదేహాలు మార్చురీలో భద్రపరుస్తారు. ఒక్కోసారి ఐదారు మృతదేహాలు మార్చురీకి వస్తుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో 2 పాత ఫ్రీజర్ బాక్స్ లు, స్వచ్ఛంద సంస్థ ఇచ్చిన 3 ఫ్రీజర్ బాక్సులు మాత్రమే ఉంటే మృతదేహాలను భద్రపర్చడం ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. ఫ్రీజర్ బాక్సులు లేకుంటే బంధువుల మృతదేహాలు పాడై దుర్గంధం వెదజల్లితే వారి కుటుంబ సభ్యులు ఎంత ఆవేదనకు గురవుతారనేది అధికారులకు పట్టదా? అని ప్రశ్నిస్తున్నారు.

ఫ్రీజర్ బాక్సులు ఏర్పాటు చేయాలి



ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఇప్పటికే ప్రజలకు సరైన వైద్యసేవలు అందడం లేదని బాధపడుతున్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో కనీసం మార్చురీలో ఫ్రీజర్ బాక్సులు బాగుచేయలేని దుస్థితి. 8 ఫ్రీజర్ బాక్సులు పాడైతే ..అధికారులు ఇప్పటి వరకూ ఏం చేస్తున్నారు. ప్రభుత్వానికి నివేదించి కనీసం బాగుచేయించాలి కదా.

– గుడిదేశి శ్రీనివాసరావు, వైఎస్సార్సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు

ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి



ఏలూరు జీజీహెచ్లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో నడిచే మార్చురీలో కనీసం ఫ్రీజర్ బాక్సులు ఏర్పాటు చేయలేకపోవటం సిగ్గుచేటు. రెండు పాత ఫ్రీజర్ బాక్సులకు మరమ్మతులు చేసి వినియోగించాల్సిన దుస్థితిలో మెడికల్ కాలేజీ యాజమాన్యం ఉంది. గతంలో మార్చురీలో మృతదేహాలను పక్క రాష్ట్రాలకు విక్రయించారనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

– ప్రత్తిపాటి తంబి, న్యాయవాది, ఏలూరు

గొంతుకోసుకుని వ్యక్తి ఆత్మహత్య



భీమవరం మల్టీఫ్లెక్స్ వద్ద గొంతుకోసుకుని పడిపోయిన క్రాంతికుమార్

భీమవరం: భీమవరం పట్టణంలో మతిస్థిమితం లేని వ్యక్తి చాకుతో గొంతుకోసుకుని మృతిచెందాడు. ఉండి గ్రామం పెదపేటకు చెందిన గాతల క్రాంతికుమార్(35) కొంతకాలంగా మానసికంగా ఇబ్బందిపడుతున్నాడు. శుక్రవారం పనికి వెళ్లిన క్రాంతికుమార్ అక్కడ పడిపోవడంతో వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి శనివారం భీమవరం ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం కుటుంబసభ్యులు తీసుకువెళ్లగా.. దెయ్యాలు వస్తున్నాయంటూ వైద్యానికి సహకరించలేదు. దీంతో ఇంటికి తీసుకు వెళ్తుండగా అంబేడ్కర్ సెంటర్కు వచ్చే సరికి యనమదుర్రు డ్రెయిన్లోకి దూకాడు. వెంటనే బయటకు తీయగా అక్కడే పండ్లు అమ్ముతున్న వ్యక్తి నుంచి చాకు తీసుకుని పరుగులు పెడుతూ ఒంటిపై గాయాలు చేసుకున్నాడు. ఉండి రోడ్డులోని మల్టీఫ్లెక్స్ వద్దకు వెళ్లేసరికి గొంతు కోసుకున్నాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి జాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్సై ఇబ్రాయిల్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్తో బస్సు దగ్ధం



కైకలూరు మాతా స్కూల్ గ్రౌండ్లో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కైకలూరు: బ్యాటరీలో షార్ట్ సర్క్యూట్ వల్ల స్కూల్ బస్సు దగ్ధమైన ఘటన కైకలూరు మాత ఇంగ్లీషు మీడియం స్కూల్ గ్రౌండ్లో శనివారం మధ్యాహ్నం జరిగింది. వేసవి సెలవులు కావడంతో బస్సు గ్రౌండ్లో ఉంచారు. బస్సు నుంచి పొగలు రావడంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ క్రాంతికుమార్ సిబ్బందితో హుటాహుటిన వచ్చి మంటలను అదుపు చేశారు. రూ.3 లక్షలకు పైగా నష్టం జరిగి ఉండవచ్చని భావిస్తున్నామన్నారు.

కొబ్బరి చెట్టుకు మంటలు



చావలిపాడు వద్ద కొబ్బరి చెట్టు పైభాగంలో మంటలు

కైకలూరు: మండవల్లి మండలం చావలిపాడు రైల్వేగేటు సమీపంలో జమ్ము గడ్డికి నిప్పంటుకుని కొబ్బరి చెట్టు మొదలు వరకు మంటలు వ్యాపించాయి. సమీపంలో ఇళ్లతో పాటు ఐస్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. కైకలూరు అగ్నిమాపక అధికారి సకాలంలో మంటలు అదుపు చేశారు. కలిదిండి పోలీసు స్టేషన్ వెనక భాగంలో కిక్కిస పొదలలో మంటలు వ్యాపించగా.. అగ్నిమాపక అధికారులు మంటలను ఆర్పివేశారు.

మానసిక ఆరోగ్యం ప్రాధాన్యతపై సదస్సు

ఉంగుటూరు: నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అమెరికాకు చెందిన హెల్త్ అవేర్నెస్ ఫర్ ఆల్ సంస్థ (హాఫా)తో సంయుక్తంగా మెంటల్ హెల్త్ అవేర్నెస్ అంశంపై ఆన్లైన్ సదస్సు శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీకే విశ్వేశ్వరరావు మాట్లాడుతూ మానసిక ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నామని, విద్యార్థులకు మానసిక రుగ్మతల పట్ల అవగాహన ఎంతో అవసరమన్నారు. హాఫా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వెంకట్ సందీప్ మాట్లాడుతూ భారతదేశంలో మానసిక రోగుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోందని, ఈ నేపథ్యంలో వివిధ సంస్థలను ఎంచుకొని ప్రతి వారం యువ డాక్టర్లతో అవగాహన కల్పిస్తూ సమాజ క్షేమానికి హాఫా కృషి చేస్తుందన్నారు. నార్త్ కరోలినా యూనివర్సిటీ సీనియర్ డాక్టర్గా డాక్టర్ శ్రావణి రెడ్డి మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా జీవించడం ద్వారా ఒత్తిడి తగ్గించుకోగలమని వివిధ అంశాలను శాస్త్రీయంగా వివరించారు. ఈ సదస్సులు పలువురు మానసిక నిపుణులు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ కొండా రవి, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి 268 మంది అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, వివిధ కళాశాలలకు చెందిన 150కి పైగా విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కారు ఢీకొని 8 గొర్రెల మృతి



లైన్ గోపాలపురంలో కారు ఢీకొని మృతిచెందిన గొర్రెలు

ద్వారకాతిరుమల: మండలంలోని లైన్ గోపాలపురం జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం కారు ఢీకొని ఎనిమిది గొర్రెలు మృతి చెందాయి. స్థానికుల కథనం ప్రకారం.. లైన్ గోపాలపురానికి చెందిన రైతు దండుబోయిన కొండయ్య గొర్రెలను సమీపంలోని ఒక తోటలో మేపి, సాయంత్రం ఇంటికి తోలుకెళుతున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి రోడ్డు దాటుతున్న గొర్రెలను ఏలూరు నుంచి రాజమండ్రి వైపుకు వేగంగా వెళుతున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో 8 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి.

ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతి

హనుమాన్ జంక్షన్ రూరల్: చెన్నై–కోల్కతా జాతీయ రహదారిపై హనుమాన్ జంక్షన్ బైపాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాష్ట్ర సచివాలయ ఉద్యోగిని నిమ్మల కుసుమ కరుణకుమారి(51) మృతి చెందారు. ఏలూరు జిల్లా వంగాయగూడెంకు చెందిన కరుణకుమారి సచివాలయం ఫైనాన్స్ డిపార్టుమెంట్లో సెక్షన్ ఆఫీసర్గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి రామవరప్పాడులోని ఓ చర్చిలో ప్రార్థనలకు హాజరయ్యేందుకు భర్త రామిశెట్టి రవికుమార్తో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లారు. ప్రార్థనల అనంతరం అర్ధరాత్రి సమయంలో ఇంటికి వెళ్తుండగా హనుమాన్ జంక్షన్ బైపాస్ రోడ్డులో ఆగి ఉన్న లారీ రివర్స్ చేస్తుండటంతో స్కూటర్పై వెళ్తున్న రవికుమార్, కుసుమ కరుణకుమారి ఆగారు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న కంటైనర్ లారీ అతివేగంగా వచ్చి వీరి స్కూటర్ను ఢీకొట్టింది. ఈ ఘటనలో స్కూటర్ వెనుక కూర్చున్న కుసుమ కరుణకుమారి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. హనుమాన్ జంక్షన్ ఎస్ఐ వి.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

కైకలూరు: వరకట్న వేధింపులతో పాటు, పరాయి స్త్రీతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడంటూ భర్తపై భార్య రూరల్ స్టేషన్లో శనివారం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చటాకాయి గ్రామానికి చెందిన ఘంటసాల చామంతి(29)తో అదే గ్రామానికి చెందిన ఘంటసాల వెంకన్నబాబు(35)కు కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలున్నారు. భర్త మద్యానికి బానిసై వరకట్నం కోసం వేధిస్తున్నాడని, అతని తల్లిదండ్రులు సహకరిస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదుపై రూరల్ ఎస్ఐ రాంబాబు భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ఉండి: ప్రమాదవశాత్తు లారీపై నుండి కింద పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆకివీడు మండలం గుమ్ములూరుకు చెందిన బూరగ యోహాను(33) కూలి పనులు చేసుకుని జీవిస్తుంటాడు. అతని భార్య గల్ఫ్లో ఉంటోంది. గత నెల 24న ఉండి మండలం చెరుకువాడలోని చేపల ప్యాకింగ్కు వెళ్లాడు. సాయంత్రం 7:30 గంటల సమయంలో ప్యాకింగ్ పనిలో భాగంగా లారీపై ఊక వేస్తుండగా ప్రమాదవశాత్తు లారీపై నుంచి జారి రాళ్లపై పడ్డాడు. దీంతో చాతి భాగం, ముఖంపైనా గాయాలయ్యాయి. కుటుంబీకులు చికిత్స నిమిత్తం భీమవరం తదితర ప్రాంతాలు తీసుకువెళ్లినా లాభం లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యోహాను శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు.

క్లుప్తంగా

వరాల వెంకన్నకు విశేష పూజలు



అత్తిలి : ఈడూరు గ్రామంలో వేంచేసి యున్న శ్రీవరాల వెంకటేశ్వర స్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామివారికి సుప్ర భాతసేవ, తోమాలసేవ జరిపారు. ఉదయం అర్చనలు, ప్రత్యేక పూజలు చేసి, స్వామివారిని విశేషంగా అలంక రించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

ఆస్తి పన్నులు వడ్డీ లేకుండా చెల్లించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ) : ఆస్తిపన్ను, ఖాళీ స్థలం పన్నులు 2025–26 ఆర్థిక సంవత్సరానికి జూన్ 30లోపు వడ్డీ లేకుండా చెల్లించాలని, ఈ ఆర్థిక సంవత్సరంలో ఒకేసారి చెల్లించే వారికి మాత్రమే వడ్డీ లేకుండా వర్తిస్తుందని మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు వెల్లడించారు. పురపాలక సంఘ కార్యాలయం కౌంటర్లోగాని, సచివాలయం ఆన్‌లైన్ ద్వారా గాని చెల్లించాలని తెలిపారు. చెక్కులు, డీడీలు చెల్లించదలిచిన వారు పురపాలక సంఘ కార్యాలయంలో నేరుగా చెల్లించి రశీదు పొందవచ్చునని చెప్పారు.

ఉచిత కంటి పరీక్షలు



ఉచిత కంటి పరీక్షలలో పాల్గొన్న అదనపు జిల్లా జడ్జి సికిందర్ బాషా, న్యాయవాదులు తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక న్యాయవాదుల బార్ అసోసియేషన్ హాల్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్ ఐ క్లీనిక్ వైద్య బృందంచే ఉచిత కంటి పరీక్షలు, ఏరియా ఆసుపత్రి వారిచే బీపీ, సుగర్ పరీక్షలు శనివారం న్యాయవాదులకు గుమాస్తాలకు, కోర్టు సిబ్బందికి నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇచ్చారు. 11వ అదనపు జిల్లా జడ్జి సికిందర్ బాషా శిబిరంను ప్రారంభించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి సూర్య కిరణ్‌లు, అసోసియేషన్ అధ్యక్షుడు శిరిగినీడి విజయకృష్ణ, పెదగాడి భూపాల్, తోట మురళీ, పీపీ శివ రామకృష్ణ, కె.మణిరాజు, ఫరోత్‌బాబు, సత్య వాణి, సౌదామిని, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి ఉపాధ్యాయ సంఘాల ఉద్యమ కార్యాచరణ

తణుకు అర్బన్: విద్యా, ఉపాధ్యాయరంగ సమస్యల పరిష్కారంలో భాగంగా పాఠశాలల్లో విద్యాశాఖ చేపడుతున్న అసంబద్ధ విధానాలకు నిరసనగా ఈనెల 5వ తేదీ నుంచి ఉద్యమ కార్యాచరణ చేపడుతున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పీఎస్‌వి ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు ఎ. వీరభద్రరావు, కార్యదర్శి వి. రామమోహన్ తెలిపారు. పాఠశాలల వర్గీకరణ వంటి అసంబద్ధ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే 3 పెండింగ్ డీఏలను మంజూరు చేయాలని, 12వ పిఆర్సీ ఏర్పాటు చేయాలని, ఆర్థిక బకాయిలను చెల్లించాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం మూడంచెల కార్యచరణలో భాగంగా మే 5న పాత తాలూకా కేంద్రాలలో 9న జిల్లా కేంద్రాలలో 14న విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

5 నుంచి దశల వారీ ఉద్యమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పాఠశాలల్లో అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 5నుంచి దశల వారీగా ఉద్యమ కార్యచరణ చేపట్టినట్లు ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణ, అధ్యక్షుడు జి.ప్రకాశంలు తెలిపారు. విద్యారంగంలో సంస్కరణల పేరుతో జీవో 117తో ప్రయోగాలు చేసి విద్యారంగాన్ని విచ్ఛన్నం చేయడం శోచనీయమని, అందులో భాగంగానే 8 రకాల పాఠశాల వ్యవస్థను తీసుకొని వస్తుందని, ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా పోరాటం చేస్తామని, మే 5న తహసీల్దార్ ఆఫీస్ వద్ద ధర్నా, మే 9వ తేదీ భీమవరం కలెక్టరేట్‌లో, మే 14వ తేదీన విజయవాడలో ధర్నాలు ఉంటాయని, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు అలంపురంలో సుగర్ పరీక్షలు

పెంటపాడు: మండలంలోని అలంపురం వెంకటరమణ ఛారిటీ ఆసుపత్రికి ఈనెల 4న హైదరాబాద్ ఆపోలో ఆసుపత్రి సుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ రాజశేఖర్ వైద్యపరీక్షలు చేయనున్నట్లు ట్రస్టు చైర్మన్ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పాదాలలో తిమ్మిర్లు, మంటలు, పాదంలో గాంగ్రీన్ (కుళ్లిపోవుట), మానని పుండ్లు, రక్త ప్రసరణ తగ్గడం, తదితర లక్షణాలకు చిన్నపాటి ఆపరేషన్‌లు చేస్తారన్నారు.

ఆహ్లాదం.. ఆమడ దూరం

- తణుకులో నిరుపయోగంగా పార్కులు
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు
- పచ్చని లాన్‌కు బదులుగా పిచ్చిమొక్కలు, కలుపు
- పార్కుల్లో మొక్కలకు నీరు కూడా పోయలేని దుస్థితి

తణుకు అర్బన్ : రోజంతా కష్టపడి ఆలసిపోయి కాసేపు ఉపసమనం పొందేందుకు పార్కులకు వెళతారు.అక్కడ చక్కటి ఆటలు ఆడుకునేందుకు పిల్లలు ఎంతగానో ఇష్టపడతారు. పిల్లలే కాదు పెద్దలు, వృద్ధులు కూడా ఇక్కడ సేదతీరుతారు. అలాంటి పార్కులు నిరుపయోగంగా మారడంతో పట్టణ ప్రజలు ఆసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ పరిధిలో సుమారు ఎనిమిది పార్కులు ఉన్నాయి. పచ్చని కార్పెట్‌లు పరిచారా అన్నట్లుగా ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు నేడు అధ్వాన్నంగా మారాయి. తణుకు మునిసిపాలిటీ పరిధిలో ఉన్న పార్కుల్లో సంరక్షణ గాడితప్పడంతో పచ్చటి వాతావరణం పూర్తిగా ఎండిపోయినట్లుగా దర్శనమిస్తుంది. మొక్కల సంరక్షణ లేక, కలుపు తీసే పరిస్థితులు లేకపోవడంతో ఇష్టానుసారంగా పెరిగిన పిచ్చిమొక్కలతో పార్కులు అత్యంత దయనీయ పరిస్థితుల్లో కునారిల్లుతున్నాయి. ముఖ్యంగా తణుకుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉండే ఎన్టీఆర్ పార్కు పచ్చదనం పోయింది. ఎక్కడ చూసినా ఎండిపోయిన మొక్కలకు తోడు ఏపుగా ఎదిగిన కలుపు, పిచ్చిమొక్కలతో అధ్వాన్నంగా మారింది. కనీసం మొక్కలకు నీరు కూడా పోయలేని దుస్థితిలో ఎన్టీఆర్ పార్కు దీనస్థితిలో ఉంది. ఆడుకునేందుకు వస్తున్న పిల్లలు నేలపై లాన్‌లేకపోవడంతో కిందపడిన సందర్భాల్లో గాయాల పాలైపోతున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. అంతేకాకుండా పార్కులో చెత్త, వ్యర్థాలు కూడా నిల్వచేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతుందని వాపోతున్నారు.



తణుకు ఎన్టీఆర్ పార్కులో కళతప్పిన ఏనుగు పరిసర ప్రాంతం



తణుకు సజ్జాపురంలో కలుపు, మురుగునీటితో నిండిపోయిన పార్కు



తణుకు ఎన్టీఆర్ పార్కులో చిన్నారుల ఆడుకునే ప్రాంతం దుస్థితి



తణుకు ఎన్టీఆర్ పార్కులో చెరువుగట్టుపై ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

విష సర్పాలకు ఆవాసంగా...

తణుకు ఎన్టీఆర్ పార్కులో ఏపుగా ఎదిగిన పిచ్చి మొక్కల కారణంగా విషసర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. పార్కులోకి వచ్చిన సందర్శకులు చీకటిపడే లోపు వెళ్లిపోవాలని లేదంటే వాకింగ్ ట్రాక్‌పై విషసర్పాలు సంచరిస్తున్నాయని భయపడుతున్నారు.



తణుకు ఎన్టీఆర్ పార్కులో చెత్త, వ్యర్థాలు

పార్కులన్నింటిలోను ఇదే దుస్థితి..

తణుకు మునిసిపాలిటీ పరిధిలో ఉన్న 8 పార్కుల్లోను పచ్చదనం కనుమరుగైపోయి దుర్గంధంగా మారాయని స్థానికులు చెబుతున్నారు. ఎన్టీఆర్ పార్కుతోపాటు సజ్జాపురం, ఎన్జీవో కాలనీ, న్యూ బ్యాంక్ కాలనీ, బ్యాంక్ కాలనీ, ఐక్యనగర్, వైఎస్సార్ పార్కుల్లో సంరక్షణ లేకపోవడంతో గతంలో వేసిన లాన్ ఎండిపోయి ఆహ్లాదం ఆవిరైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దాతలే దిక్కు..

తణుకులో ఉన్న పార్కులన్నీ గతంలో పచ్చదనంతో నిండిఉండగా నేడు ఎడారి వాతావరణాన్ని తలపిస్తున్నాయి. వాటిని మళ్లీ పచ్చదనంతో నింపాలంటే లక్షలాది రూపాయిలు వెచ్చించాల్సి ఉంది. దీంతో ఇటీవల తణుకు మునిసిపల్ కార్యాలయంలో పారిశ్రామికవేత్తల సమావేశంలో పార్కుల అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు.

ఉపాధి పథకాన్ని నీరుగార్చేందుకు కేంద్రం యత్నాలు



పెదతాడేపల్లిలో ఉపాధి హామీ పథకం శ్రామికులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు కేంద్ర ప్రభుత్వం చూస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు పేర్కొన్నారు. శనివారం మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రామికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సోమరాజు మాట్లాడుతూ గత ఏడాది ఉపాధి హామీ పథకంలో గుండెపోటుతో శ్రామికుడు మృతి చెందితే ఒక్క రూపాయి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన రూ.307లు రావడం లేదన్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూలి పెంచడానికి కృషి చేయాలన్నారు. అలాగే ఉపాధి హామీ పథకానికి రూ.2.40లక్షల కోట్లకు బడ్జెట్ పెంచాలన్నారు. భూమి రమేష పశుపతి రత్నం, శ్యాంబాబు, ఆలపాటి సత్యనారాయణ, కొమరం మేరీ రామ్మోహన్‌రావు, పెన్నాడ సుశీల, కోటిపల్లి సంతోష్, యర్రంశెట్టి పచ్చిపూరి లక్ష్మీసేనాపతి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం



పుస్తక ప్రదర్శన చేస్తున్న రిసోర్స్‌పర్సన్స్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గ్రేడ్–1 వేసవి శిక్షణ శిబిరం శనివారం ఆరోవ రోజు కొనసాగింది. రిసోర్స్‌పర్సన్స్‌గా హాజరైన ప్రత్తి వీరాస్వామిచే కథలు, వి.జనార్ధనరావుచే పిల్లలకు డ్రాయింగ్ నేర్పించారు. కోపల్లె శ్రీనివాస్‌చే విద్యార్థులకు సంగీతం, నృత్యం, ఆర్ట్ బోధించారు. జి.బాపయ్య శర్మచే జనరల్ నాలెడ్జి, తదితర ఇతర అంశాలను అవగాహన కల్పించారు. శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి పి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ మరింత మంది విద్యార్థులు హాజరై శిక్షణను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో వేమన శతక పద్యాలను చదివిస్తున్న దృశ్యం

మహాకవుల శతక పద్యాలను నేర్చుకోవాలి

అత్తిలి: విద్యార్థులు వేమన వంటి మహా కవుల శతక పద్యాలను నేర్చుకోవాలని రిసోర్సుపర్సన్ కె సత్యనారాయణ అన్నారు. వేసవి శిక్షణలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం వేమన శతక పద్యాలు చెప్పి వాటి అర్థాలను వివరించారు. విద్యార్థులకు అక్బర్ బీర్‌బల్ కథలు చెప్పి, చెస్‌లో మెళకువలను తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, రిటైర్డు గ్రంథాలయాధికారి గంధం శేషవేంద్రరావు, వి లక్ష్మణరావు, ఆర్ దానకృష్ణ, ఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లా క్రీడా సంస్థ ఆధ్వర్యంలో బాస్కెట్ బాల్, అథ్లెటిక్స్‌లో వేసవి శిక్షణ శిబిరం శనివారం స్థానిక కడకట్ల కోడే వెంకట్రావు మునిసిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. రాజమండ్రి సర్కిల్ ఇనస్పెక్టర్, క్రీడాకారుడు ఏఎల్ఎస్ రవి కుమార్‌చే శిబిరంను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులుగా శిక్షణ పొంది జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని చెప్పారు. ఈ శిబిరంలో డాక్టర్ నార్ని భావాజీ, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు కిరణ్ కుమార్, రాజేష్ కుమార్‌లు పాల్గొన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ జూన్ 9 వరకు శిక్షణ ఉంటుందని వెల్లడించారు. శిబిరం ఇంచార్జి, పీడీ చింతకాయల సత్యనారాయణ, ఆశిష్ రాజులు వ్యవహరిస్తారని చెప్పారు.



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

వీధుల్లో గ్రామసింహాల హల్‌చల్

- విచ్చలవిడిగా గ్రామాల్లో కుక్కల స్వైరవిహారం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

యలమంచిలి: గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కలు ప్రజలపై దాడి చేసి కరుస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గతంలో పంచాయతీ అధికారులు కుక్కలను పట్టుకుని చంపేవారు. బ్లూక్రాస్ సంస్థ ఆంక్షలతో కుక్కలను చంపడం మానివేసి పట్టుకుని ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లి వదిలేసి వచ్చేవారు. కానీ అది కూడా అధిక వ్యయప్రయాసలతో కూడిన పని కావడంతో ఈ మధ్య కాలంలో కుక్కలు పట్టుకోవడం మానివేశారు. దీంతో గ్రామాల్లో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. అదే సమయంలో కుక్క కాటుకు గురయ్యేవారు కూడా ఎక్కువయ్యారు. ఏ గ్రామంలో చూసిన వందల సంఖ్యలో కుక్కలు కనిపిస్తున్నాయి. యలమంచిలి మండలంలోని యలమంచిలిలంక, శిరగాలపల్లి, యలమంచిలి, చించినాడ గ్రామాలలో కుక్కలతో పాటు కోతుల బెడద కూడా ఎక్కువగా ఉంది. ఈ గ్రామాల్లో వందల సంఖ్యలో కోతులు సంచరిస్తున్నాయి. వారంలో కనీసం పది మంది కోతి దాడికి గురైన వ్యక్తులు యలమంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నట్లు ఫార్మాసిస్ట్ మేడికొండ రామదాసు చెప్పారు.

25 రోజుల్లో 600 కేసులు

పశ్చిమ గోదావరి జిల్లాలో ఏప్రిల్ 25వ తేదీ నుంచి గణాంకాలు పరిశీలిస్తే మొత్తం 595 మంది జంతువుల కాటుకు గురైనట్లు తెలుస్తోంది. జిల్లాలో 32 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 18 అర్బన్ పీహెచ్‌సీలు, 8 ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. ఈ ఆసుపత్రుల నుంచి ఈ నెలలో (ఏప్రిల్ ఒకటి నుంచి 25వ తేదీ వరకు) జిల్లా వైద్య శాఖాధికారి కార్యాయానికి వచ్చిన నివేదికల ప్రకారం 507 మంది కుక్క కాటుకు, 36 మంది పాము కాటుకు 52 మంది ఇతర జంతువుల కాటుకు గురైనట్లు రికార్డ్ అయ్యింది. అంటే జిల్లాలో సరాసరిన రోజుకు 20 మంది జంతువుల కాటుకు గురవుతున్నారు. కుక్క కాటుకు వేసే ఏఆర్‌వీ (యాంటీ రాబిస్ వ్యాక్సి) ఇంజక్షన్‌లనే కోతి కాటుకు కూడా వేస్తారు. పాము కాటుకు ఏఎస్‌వీ (యాంటీ స్నేక్ వ్యాక్సిన్) వేస్తారు. జిల్లాలోని ప్రభుత్వాసుపత్రులో ఈ రెండు రకాల వ్యాక్సిన్‌లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారులు చెబుతున్నారు. వైద్యం అందుబాటులో ఉన్నా కుక్కలను కోతులను కంట్రోల్ చేయడానికి పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కుక్కల సంతతి పెరగకుండా వాటిని పట్టుకుని ఆపరేషన్లు చేయాల్సి ఉంది. అయితే ఆ దిశగా ఎక్కడా చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు వేడుకుంటున్నారు.



వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

6న చాంబర్స్ కళాశాలలో ఇంటర్వ్యూలు

యలమంచిలి: సంధ్య మెరైన్స్, జగదీష్ మెరైన్స్ సంస్థల్లోని ఖాళీలను భర్తీ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో స్థానిక చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 6న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ కేవీ నరసింహారావు, ప్రిన్సిపల్ డాక్టర్ డి. వెంకటేశ్వరావు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, ఆక్వా కల్చర్, ఐటీఐ చేసిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు అర్హులని వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఇతర వివరాలకు 99120 46234, 94935 03441 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

స్టీల్, ఇత్తడి దుకాణాలపై విజిలెన్స్ దాడులు

తణుకు అర్బన్: తణుకులో స్టీల్, ఇత్తడి సామాన్ల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, తూనికలు కొలతల అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. పట్టణ పరిధిలో ఉన్న స్టీల్, ఇత్తడి దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సామగ్రిపై కేసులు నమోదు చేశారు. విజిలెన్స్ ఎస్సై కె.సీతారాం, తూనికలు కొలతల అధికారి టి.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. తణుకు పట్టణ పరిధిలోని శ్రీనాగరత్న స్టీల్ సెంటర్, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఇత్తడి షాపు, స్నేహ మెటల్ అండ్ జనరల్ స్టోర్స్, కారుమూరి సూర్యనారాయణ మూర్తి అండ్ సన్స్, దుర్గ శ్రీనివాస మెటల్ అండ్ జనరల్ స్టోర్స్‌లో చేసిన తనిఖీల్లో పూజా సామాన్లు, వాటర్ బాటిల్స్, సీలింగ్ ఫ్యాన్‌లు, ప్లాస్కులు, గ్యాస్ స్టవ్ విడిభాగాలకు సంబంధించి ఆయా సామగ్రిపై ప్యాకింగ్ తేదీ, తయారీదారు చిరునామా, కంపెనీ సీల్స్, గరిష్ట చిల్లర ధర, వినియోగదారు సేవ ఫోన్ నంబరు, మెయిల్ ఐడీ వంటి సమాచారం లేకుండా విక్రయాలు చేస్తున్నట్లుగా గుర్తించి తూనికలు, కొలతల చట్ట ప్రకారం ఆ దుకాణాలపై కేసులు నమోదు చేశారు. రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.శ్రీరాంబాబు ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు ఎస్సై సీతారాం తెలిపారు. ఈ రకమైన విక్రయాలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



తణుకులో ఇత్తడి దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

లూథరన్ చర్చిలో ముగిసిన సీబీసీ తరగతులు



గూడెం టౌన్ ఎ.క్లాస్ ఫ్యారిష్ సెంటినరీ చర్చిలో సీబీసీ విద్యార్థులు

పెంటపాడు: గత నెల 25 నుంచి గూడెం పట్టణ ఎ.క్లాస్ ప్యారిష్ సెంటినరీ చర్చిలో జరుగుతున్న సీబీసీ శిక్షణ తరగతులు శనివారంతో ముగిసాయి. సీబీసీ (క్రిష్టియన్ బైబిలు కోర్సు)లో భాగంగా ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు స్థానిక చర్చిలో చిన్నారులు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముగింపు పురస్కరించుకొని కోర్సు డైరెక్టర్ పి. నిర్మల, సహాయకురాలు షమిదా ఏంజిల్‌ల ఆధ్వర్యంలో ఈ సందర్భంగా చిన్నారులకు ఆటపాటల ద్వారా సండేస్కూల్ ఉపాధ్యాయులు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులకు బైబిలు ద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నేర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సు సమయంలో విద్యార్థులు నేర్చుకొన్న పలు రకాల బొమ్మలు, డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన విజేతలకు సంఘ గురు మండల అధ్యక్షుడు డీఎల్ ఫీనెహాస్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. సహాయ గురుమండల అధ్యక్షుడు రత్నాకర్, సంఘ సభ్యులు, సండేస్కూలు టీచర్లు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామికి విశేష పూజలు



లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుంటున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ :పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునఃనిర్మాణం చేయడం ఆనందదాయకమని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సంతోషం వ్యక్తం చేశారు. శనివారం లక్ష్మీనరసింహస్వామి నూతన ఆలయంలోని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 300 ఏళ్ల క్రితం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉన్నట్లు చరిత్రలో ఉందన్నారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన ఆలయ పునఃనిర్మాణానికి తాను దేవదాయశాఖ మంత్రిగా ఉన్న సమయంలో రూ.1.40 కోట్లు మంజూరు చేయడం తనకు లభించిన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆలయ అభివృద్ధికి స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు చేసిన కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, తగరం పూడి మురళీ, గారపాటి వీరకుమార్, ఆరమిల్లి రవి, లంకా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాల అనుమతులకు వెసులుబాటు

తణుకు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో ఎంఎస్ నంబరు 20 మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ప్రకారం పట్టణ పరిధిలోని ప్రజలు సులభతరంగా స్వీయ ధ్రువీకరణ పత్రం పత్రం సమర్పించి భవన నిర్మాణ అనుమతులు పొందుటకు వెలుసుబాటు కల్పించినట్లు తణుకు మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ తెలిపారు. మునిసిపాలిటీ లైసెన్స్ పొందిన లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్, సర్వేయర్స్, ఇంజనీర్ల ద్వారా గ్రామ కంఠము, అధికార లేఅవుట్స్, సర్కులేషన్ ప్యాటరన్స్ ప్రాంతాల్లో నివాసం కోసం భవన నిర్మాణ అనుమతులు స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించి సులభతరంగాను, అత్యంత పారదర్శకంగా పొందవచ్చని సూచించారు. ఇందు నిమిత్తం తణుకు పురపాలక సంఘ పట్టణ ప్రణాళిక విభాగంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

కారుమూరి పరామర్శలు

ఇరగవరం: మండలంలోని తూర్పు విప్పర్రు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కోనరెడ్డి నాయుడును ఇటివల అనారోగ్యానికి గురైయ్యారు. మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ ఆయన ఆరోగ్యం కుదిట పడి త్వరగా కోలుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నాం అన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికి పార్టీ అండగా ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో సైపురెడ్డి పెద్ది రాజు, గంజి సతీష్, సిరంగం శ్రీనివాస్, షేక్ మాబ్ గుండుమోలు రాము మామిడిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోతాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

అత్తిలి: మండలంలోని ఉనికిలి గ్రామంలో కోతాట ఆడుతున్న ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు ఎస్సై పి ప్రేమరాజు చెప్పారు. శనివారం అత్తిలి మండలం ఉనికిలి గ్రామ శివారు కాలువగట్టుపై ముద్దాయిలు డబ్బులు పణంగా పెట్టి కోత బంతి ఆట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై ప్రేమరాజు సిబ్బందితో దాడిచేసి ఇద్దరు ముద్దాయిలను అదుపులోకి తీసుసుకుని వారివద్దనుండి రూ. 2500లు నగదు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు.